సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ; 14 ; జూన్ ; 2025

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.



బ్రాండ్ అంబాసిడర్ కీర్తన

వైరా మండలం నారపునేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గత ఏడాది నాలుగో తరగతి విద్యార్థి ఎస్.కీర్తన మాత్రమే మిగలగా అధికారులు స్కూల్ మూసివేతకు నిర్ణయించారు. కానీ ఆమె తండ్రి అనిల్‌శర్మ మాత్రం పాఠశాల మూసివేస్తే తన కుమార్తె చదువు మాన్పిస్తానని చెప్పడంతో కొనసాగించిన విషయం విదితమే. ఆపై పాఠశాలలో వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు బడిబాట ద్వారా చేసిన కృషితో ఈసారి పది మంది ప్రవేశాలు పొందారు. ఈమేరకు పాఠశాల నిలబడడానికి కారణమైన కీర్తనను బ్రాండ్ అంబాసిడర్‌గా భావిస్తూ ఆమె ఫొటోను బడి గోడపై ఆకట్టుకునేలా వేయించగా స్థానికులు అభినందిస్తున్నారు.

– వైరారూరల్

న్యూస్‌రీల్

స్వర్ణకవచ ధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్కిల్ ట్రైనింగ్‌కు 28 మంది ఎంపిక



అభ్యర్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం బాబూక్యాంపులోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 52 మంది పేర్లు నమోదు చేసుకోగా, 28 మంది ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ వివరాలు వెల్లడించారు. వీరికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తూ వివిధ విభాగాల్లో శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, క్విక్ సర్వీస్ రెస్టారెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ స్టైవార్డ్, రిటైల్ సేల్స్ అసోసియేట్‌లలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ వార్డుల విభజనపై ఆరా



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సంపత్

అశ్వారావుపేటరూరల్: కొత్తగా ఏర్పాటైన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియను శుక్రవారం వార్డుల విభజన ప్రత్యేకాధికారి, మధిర మున్సిపాలిటీ కమిషనర్ ఏ.సంపత్ పరిశీలించారు. పలు ప్రాంతాలను సందర్శించి విభజనపై ఆరా తీశారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పట్టణ ప్రణాళిక అధికారి వలసాల శ్రీనివాసరావుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది ఎం.కామేష్, నాగేంద్ర, రమణ, మురళి, కట్టా శ్రీను పాల్గొన్నారు.

‘అరుదైన’ అన్వేషణ



సింగరేణి సంస్థ పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గని (ఫైల్)

గోదావరి లోయలో 14 రకాల అరుదైన ఖనిజాల ఆనవాళ్లు

- మరిన్ని పరిశోధనల కోసం ఐఎంఎటీతో ఒప్పందం
- సానుకూల ఫలితాలు వస్తే సింగరేణి దశ తిరిగినట్టే

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నెల రోజుల క్రితం చైనా, అమెరికాల మధ్య మొదలైన టారిఫ్‌ల వార్ ఇటీవల సద్దుమణిగింది. తన దగ్గరున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌ను (అరుదైన మూలకం) అమెరికాకు ఎగుమతి చేయడంపై చైనా ఆంక్షలు విధించడంతో అమెరికా ఒక అడుగు వెనక్కి తగ్గక తప్పలేదు. దీన్నిబట్టి అంతర్జాతీయంగా రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఎంతో ప్రాముఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడీ రంగంలో మైనింగ్‌కు సింగరేణి సంస్థ సిద్ధమవుతోంది.

కీలక ఒప్పందం

రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ ప్రారంభించేందుకు సింగరేణి ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) – భువనేశ్వర్ అనుబంధ సంస్థగా ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ)తో ఇటీవల ఒప్పందం చేసుకుంది. సింగరేణి గనులు ఉన్న ప్రాంతంలో రేర్ ఎర్త్ మినరల్స్‌ను కనుగొనడం, దేశ పారిశ్రామిక అవసరాలను ఆ మినరల్స్ ఏ మేరకు ఉపయోగపడతాయనే అంశాలపై ఈ రెండు సంస్థలు కలిసి పని చేయనున్నాయి.

వరుస ప్రకటనలు

వందేళ్లకు పైగా బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి పదేళ్ల కిందట విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి వచ్చి సానుకూల ఫలితాలు సాధించింది. ఈ రంగంలో దక్కిన విజయాలు అందించిన ఉత్సాహంతో బహుముఖంగా విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి ఇసుక తీసే విధానం పరిశీలించినా... ఆశించిన ఫలితాలు రాలేదు. ఇల్లెందు, రామగుండంలో ప్రతిపాదించిన పంప్డ్ స్టోరేజీ హైడల్ పవర్ ప్లాంట్ అంశం, మణుగూరు దగ్గర జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు అంశాల పరిస్థితి ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉంది. ఇప్పుడు రేర్ ఎర్త్ మైనింగ్ అంశం తెర మీదకు వచ్చింది. అయితే ‘అరుదైన’ ప్రయత్నాలు సానుకూల ఫలితాలు అందిస్తే సింగరేణి దశా దిశా మారడం ఖాయం.

అరుదైన ఖనిజాల ఆనవాళ్లు

గోదావరి – ప్రాణహిత లోయలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. సంస్థ పరిధిలో 22 భూగర్భ గనులు, 18 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయి. ఇందులో కొన్ని ఓపెన్ కాస్ట్ గనులు ఉన్న చోట అరుదైన ఖనిజాలు ఉన్నట్టుగా ప్రాథమికంగా నిర్ధారించారు. సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గును థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు పంపుతున్నారు. అక్కడ మండించిన బొగ్గు నుంచి వెలువడిన బూడిదలో కూడా కొన్ని రేర్ ఎర్త్ మినరల్స్ అవశేషాలు లభించాయి. ఇప్పటివరకు సింగరేణి ప్రాంతంలో 14 రకాల ఖనిజాల ఉనికిని సైంటిస్టులు కనిపెట్టారు. వీటిలో లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కేటగిరీలో లాంథనమ్, సిరియమ్, ప్రసియోడీమియం వంటి మూలకాలు ఉండగా హెవీ ఎర్త్ ఎలిమెంట్స్ విభాగంలో ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం తదితర ఎనిమిది రకాల మూలకాల జాడ లభించింది. జిల్లాలో మణుగూరు బ్లాక్ పరిధిలోకి వచ్చే దుర్గం గుట్టలు (వాజేడు మండలం బొగత జలపాతం క్యాచ్‌మెంట్ ఏరియా) దగ్గర సగటున 266.21 పీపీఎం స్థాయిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన నమూనా పరీక్షల్లో తేలింది.

ఉపయోగపడతాయా ?

సింగరేణి గనులు విస్తరించిన ప్రాంతంలో కనిపిస్తున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ పారిశ్రామిక అవసరాలను తీర్చే విధంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని నిర్ధారించేందుకు డీప్ సైంటిఫిక్ రీసెర్చ్ చేయాల్సిన అవసరముంది. దీని కోసమే భువనేశ్వర్‌లోని ఐఎంఎంటీతో సింగరేణి చేతులు కలిపింది. దేశీయంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తూనే విదేశాల్లో కూడా రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణలో ఉంది. ముఖ్యంగా లిథియం మైనింగ్ కోసం బొలీవియా, చిలీ, అర్జెంటీనాలో గల అవకాశాలను పరిశీలించింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియాతో అరుదైన ఖనిజాల ఉత్పత్తికి సంబంధించి అవగాహనకు వచ్చినట్టు సింగరేణి యాజమాన్యం ఇప్పటికే ప్రకటించింది.

సింగరేణి అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఇంజనీరింగ్ అండ్ మెకానికల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు అధికారులను బదిలీ చేస్తూ ఈఈ సెల్ హెచ్‌వోడీ ఏజే. మురళీధర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్‌లోని టెక్నికల్ సర్వీసెస్‌లో జీఎం వి.రామమూర్తిని డైరెక్టర్ ఈ అండ్ ఎం విభాగానికి, జైపూర్‌లోని ఎస్టీపీపీ పీసీఎస్ జీఎం కొండారెడ్డి శ్రీనివాసులు ఎస్టీపీపీ ఈఅండ్ఎంకు, కార్పొరేట్‌లోని ఎంపీ డిపార్ట్‌మెంట్ అడిషినల్ జీఎం పి.మురళీకృష్ణను టెక్నికల్ సర్వీసెస్‌కు, ఆర్జీ–2 ఏరియా ఇంజనీర్ నర్సింహారావును జైపూర్‌లో ఎస్టీపీపీకి బదిలీచేశారు. వీరందరూ ఈ నెల 21వ తేదీలోగా కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలకార్మికులను గుర్తించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

చండ్రుగొండ : బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన అధికారులకు సూచించారు. మండలంలోని అయన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలుత పిల్లలతో విద్యాభ్యాసం చేయించారు. పలకలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం పీఎంశ్రీ నిధులతో నిర్మించిన తరగతి గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, ఇతర సైదులు, నాగరాజశేఖర్, బయ్యారపు అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఏజెన్సీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు ముందస్తు జాగ్రత్తలను పాటించాలని చెప్పారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాన్పులు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని, 24 గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. చర్ల, దుమ్ముగూడెం, సింగరేణి, కారేపల్లి మండలాల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, ఆయా మండలాల్లో శానిటేషన్ పట్ల నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పాటించాలని, డెంగ్యూ నిర్ధారణ కేసులు నమోదైన గ్రామంలో పూర్తిస్థాయిలో శానిటేషన్ చేయాలని సూచించారు. వైద్యాధికారులు చైతన్య, రామకృష్ణ, జయలక్ష్మి, మధువరన్, పుల్లారెడ్డి, తేజ శ్రీ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు అభినందనలు

గిరిజన సంక్షేమ శాఖ కళాశాలల్లో చదివి జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను పీఓ అభినందించారు. శుక్రవారం విద్యార్థులు పీఓ రాహుల్‌ను ఆయన చాంబర్‌లో కలవగా వారిని శాలువాతో సత్కరించారు.ఉన్నత విద్యలో సైతం ఇదే విధంగా ప్రతిభ చాటాలని సూచించారు. గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, బాలస్వామి, పద్మావతి, రమేష్, నరసింహారావు, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ , హరీష్, కేశవరావు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఆనందఖని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. విద్యాశాఖ కోఆర్డినేటర్లు నాగరాజశేఖర్, ఓ.సైదులు, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, బాబూలాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు 16 నుంచి ఎంపికలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హకీంపేటలోని తెలంగాణ క్రీడా సాధికార సంస్థ అండ్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మండలస్థాయిలో ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం పరంధామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి ఎంపికలకు వచ్చేవారు tgss. telangana. gov. in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు నంబరు, ఫోన్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్‌తో ఫొటో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. 2016 సెప్టెంబర్ 1 నుండి 2017 ఆగస్టు 31 మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. మండలస్థాయిలో ఎంపికైన బాలబాలికలకు జిల్లాస్థాయిలో ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. వివరాలకు డీవైఎస్ఓ కార్యాలయంలో లేదా 9505429000, 9966125087 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కౌలు రైతులకు సాయమేది..?

- రైతు భరోసా ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఆ ఊసేలేదు
- పెట్టుబడులకు ప్రైవేటు అప్పులతో ఆర్థిక భారం



భూమిని దున్నుతున్న కౌలు రైతు

బూర్గంపాడు: కౌలు రైతులకు పంటల పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవటం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఆ ఊసెత్తటం లేదు. బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇవ్వక, రైతు భరోసా అందక కౌలు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పంట పెట్టుబడులకు ప్రైవేటు అప్పులపైనే ఆధారపడుతున్నారు. గత ప్రభుత్వం మాదిరే ఈ ప్రభుత్వం కూడా వారిపై కనికరం చూపటం లేదు. పంటల అమ్మకానికీ, ఎరువులు కొనుగోలుకూ నానా యాతన పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు వ్యవసాయ సీజన్‌లు ముగిసినా కౌలు రైతులకు మాత్రం రూపాయి సాయం అందలేదు.

జిల్లాలో 42వేల మందికి పైగానే..

జిల్లాలో 42 వేల మందికి పైగా కౌలు రైతులున్నారు. వీరిలో 90శాతం మంది చిన్న సన్నకారు రైతులే. తమకు ఉన్న ఎకరం, అరెకరం భూమితో పాటుగా మూడెకరాల నుంచి ఐదెకరాల వరకు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వపరంగా ఎలాంటి చేయూత అందటం లేదు. కనీసం బ్యాంకుల్లో పంట రుణాలకు కూడా వీరు అర్హులు కాలేకపోతున్నారు. సాగు పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వపరంగా అందించే సాయం పట్టాదారుల బ్యాంకు ఖాతాల్లోకే చేరుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవాలన్నా పట్టాదారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్న పట్టాదారుల పేరుమీదనే కొనుగోలు చేయాల్సి వస్తుంది.

పెరిగిన కౌలు ధర

జిల్లాలో సుమారు 1.65 లక్షల ఎకరాల భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నట్లు అంచనా. గత రెండేళ్లుగా భూముల యజమానులు కౌలు ధరను అమాంతం పెంచారు. మాగాణి భూముల కౌలు ఎకరం రూ.18వేల నుంచి రూ.20వేల వరకు, పత్తి సాగు చేసే మెట్ట భూములకు రూ.20 వేల నుంచి రూ. 25 వేల వరకు పెరిగింది. మిర్చి, పొగాకు, కూరగాయల పంటల సాగు చేసే భూములు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ. 35 వేల వరకు పెంచారు. కౌలు ధరలతో పాటు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ట్రాక్టర్ దుక్కులు, కూలీల వేతనాలు కూడా ప్రతి ఏటా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు గిట్టుబాటు ధరలు దక్కక అప్పుల పాలవుతున్నారు. అప్పుల బాధతో ఇటీవల కాలంలో కౌలు రైతుల ఆత్మహత్యలకు కూడా పెరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి ఎన్నికల హామీ మేరకు రైతుభరోసా అందించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రూపాయి సాయం లేదు



ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని మూడు ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేస్తాను. వ్యవసాయం తప్ప మరే పని చేయలేను. ప్రభుత్వం రైతు భరోసా ఇస్తానంటే ఆశపడ్డాను. కానీ ఇప్పటివరకు రూపాయి సాయం అందలేదు. అసలు కౌలు రైతులను పట్టించుకోవటం లేదు. – గద్దం సాంబశివరావు, కౌలు రైతు, గుండాల

హామీ అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలి. కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కౌలు రైతులు అన్నివిధాల ఆర్థికంగా నష్టపోతున్నారు. మాకు న్యాయం జరిగేలా కౌలు రైతు చట్టం తేవాలి.

– నిమ్మల రాములు, కౌలు రైతు, నాగినేనిప్రోలు

ఎస్‌హెచ్‌జీలకు అండగా..

- బాధిత కుటుంబాలకు పరిహారం అందించనున్న ప్రభుత్వం
- సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షలు పరిహారం
- ఉమ్మడి జిల్లాలో 43,521 స్వయం సహాయక సంఘాలు



సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు

చుంచుపల్లి: మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం పాటుపడుతోంది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు అందిస్తోంది. మహిళాశక్తి పేరుతో ప్రత్యేక రుణాలను అందించడంతోపాటు చిరు వ్యాపారాలను కూడా ప్రోత్సహిస్తోంది. తాజాగా రూ.10 లక్షల వరకు ప్రమాద పరిహారం వర్తింపజేసేలా రాష్ట్ర మంత్రి మండలి ఇటీవల నిర్ణయం తీసుకుంది. ప్రమాదవశాత్తు ఎస్‌హెచ్‌జీ సభ్యులు మృతి చెందితే బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించనుంది. ప్రమాద బీమాను 2024 మార్చి 14 నుంచి వర్తింపజేయనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రమాదవశాత్తు మృతిచెందిన వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. మృతి చెందిన సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోయి ఉంటే ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల్లో రుణ బకాయిలు మినహాయించుకుని మిగతా పరిహారం బాధిత కుటుంబాలకు అందజేస్తారు. సహజ మరణం పొందిన సభ్యులకు మాత్రం రూ.2 లక్షల లోపు రుణ బకాయిలు ఉంటే డబ్బులను ప్రభుత్వమే చెల్లించి వారి రుణ ఖాతాలను మూసివేయనుంది.

ఉమ్మడి జిల్లాలో 43,521 ఎస్‌హెచ్‌జీలు

గతంలోనూ సభ్యులు కొంత మేర ప్రీమియం చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం జోడించి బీమా సౌకర్యాన్ని కల్పించేది. ప్రస్తుతం మహిళా సంఘాలకు ప్రభుత్వమే నేరుగా ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించడంతో బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 మండలాల్లో 43,521 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,54,313 మంది మహిళలు సభ్యులు కొనసాగుతున్నారు. వీరికి ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే రుణ, ప్రమాద బీమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రమాదంలో సభ్యురాలు మృతి చెందినా, వంద శాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా పూర్తిగా మాఫీ చేస్తారు. ఇందుకు గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపుతూ సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు, పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. బీమా సౌకర్యం 18 నుంచి 60 ఏళ్ల వయసున్న సభ్యులకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటివరకు రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. ఇక నుంచి చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో ఎస్‌హెచ్‌జీల వివరాలు

	ఖమ్మం	భద్రాద్రి
మండలాలు	20	22
వీఓలు	1,017	981
ఎస్‌హెచ్‌జీలు	25,106	18,415
సభ్యులు	2,72,701	1,81,612

ఎంతో ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు కల్పించిన ప్రమాద బీమా సౌకర్యంతో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగనుంది. ప్రమాదంలో మృతి చెందితే కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల పరిహారం వర్తిస్తుంది. దీనిపై మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

–ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

మక్కా పాదయాత్రికుడికి సత్కారం


అబీద్‌ను సత్కరిస్తున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు: పట్టణంలోని నంబర్-2 బస్తీకి చెందిన అబీద్ మూడు దేశాలను చుట్టి 7,500 కిలోమీటర్ల దూరం పాదయాత్రగా నడిచి వెళ్లి మక్కా యాత్రను విజయవంతం చేసుకుని ఇల్లెందుకు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం సత్కరించారు. బీఆర్‌ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, జేకే శ్రీనివాస్, శీలం రమేశ్, చోటిమియా, అబ్దుల్ నబీ, అబ్దుల్ జబ్బార్, గిన్నారపు రాజేశ్, చాంద్‌పాషా, భుక్యా సురేశ్, నీలం రాజశేఖర్, సన రాజేశ్, సాతల్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే నెల 10న బుద్ధ పూర్ణిమ సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్‌లోని మణుగూరు, సత్తుపల్లి, ఖమ్మం డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు. జూలై 8న సాయంత్రం 7 గంటలకు ఖమ్మం నుంచి, మణుగూరు నుంచి 6 గంటలకు, సత్తుపల్లి నుంచి 7 గంటలకు బయలుదేరే బస్సులు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత 9వ తేదీ రాత్రి అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. అలాగే, 10వ తేదీన గిరిప్రదక్షిణ, అరుణాచలేశ్వరుడి దర్శనం అనంతరం మధ్యాహ్నం బయలుదేరే బస్సులు 11వ తేదీన ఉదయం డిపోలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఖమ్మం, సత్తుపల్లి నుంచి పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.2,500, మణుగూరు నుంచి పెద్దలకు రూ.5,500, పిల్లలకు రూ.2,750 చార్జీగా నిర్ణయించినట్లు ఆర్‌ఎం తెలిపారు. ఇతర వివరాలు, రిజర్వేషన్ కోసం మణుగూరు డిపో మేనేజర్ (99592 25963), సత్తుపల్లి డీఎం 99592 25962, ఖమ్మం డీఎం 99592 25958 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఎస్‌ఈ జి.మహేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఈ, డీఈల ఫోన్ నంబర్ల వివరాలిలా ఉన్నాయి.

ఎస్‌ఈ -	87124 85815
డీఈ(టెక్నికల్) -	87124 85816
కొత్తగూడెం డీఈ -	87124 85849
పాల్వంచ డీఈ -	87124 85949
భద్రాచలం డీఈ -	87124 86022

నాణ్యతతో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలి

దుమ్ముగూడెం : మండలంలోని బొజ్జిగుప్ప గ్రామంలో చేపట్టిన చెక్‌డ్యామ్ పనులు నాణ్యంగా ఉండాలని ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన చెక్‌డ్యాంను క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సయ్యద్ అహ్మద్ జానీ, వెంకటరమణ, మధుసూదన్ రావు, రవీందర్, రాజ్‌సుహాస్, శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

జూలూరుపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ సమయంలో కారులోని బెలూన్స్ తెరుచుకోవడంతో పాల్వంచకు చెందిన డ్రైవర్ శివప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ముగ్గురు పిల్లలతో వివాహిత అదృశ్యం

ములకలపల్లి: ముగ్గురు పిల్లలతో వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. అన్నపురెడ్డిపల్లి మండలానికొ చెందిన సునీతకు ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కుక్కముడి నవీన్‌తో 11 ఏళ్ల కిందట వివాహమైంది. ముగ్గురు కుమార్తెలున్నారు. గురువారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులను వెళ్లగా, సునీత పిల్లలతో కలిసి బయటికి వెళ్లింది. ఇంటికొచ్చిన కుటుంబీలకు ఎవరూ కనిపించకపోవడంతో సునీత తల్లిదండ్రులను ఆరాతీయగా అక్కడికీ రాలేదని తెలిసింది. సునీత తండ్రి మహంకాళి శ్రీను శుక్రవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు..




రక్తదానం చేస్తున్న భద్రాచలం జడ్జి శివనాయక్, ఏఎస్పీ అంకిత్‌కుమార్ (ఫైల్)

- బ్లడ్ డొనేషన్‌పై యువకుల్లో పెరిగిన అవగాహన
- ఆపద సమయాల్లో రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్న యువత

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

భద్రాచలంఅర్బన్: ఎన్నో సందర్భాల్లో రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోతున్నవారు చాలా మంది ఉన్నారు. ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చినప్పటికీ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాక తనువు చాలించాల్సిన ఘటనలు అనేకం. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందిస్తే ప్రాణాలు నిలుస్తాయి. ఈ రక్తాన్ని కేవలం మరో వ్యక్తి నుంచే సేకరించాలి. అందుకే రక్తదానానికి అంత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం రక్తదానంపై విద్యావంతులు, యువకుల్లో అవగాహన పెరిగింది. అవసరమైన వారికి రక్తదానం చేసేందుకు అనేక మంది ముందుకు వస్తున్నారు. రక్తదానం వెలకట్టలేనిది. సరైన సమయానికి దొరికితే ఓ నిండు ప్రాణం నిలబడుతుంది. రక్తదానం అన్నది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయపడే గొప్పదానం. రక్తం ఆవశ్యకత తెలిసినప్పటికీ ఇప్పటికీ రక్తదానం చేసేందుకు చాలామంది వెనకడుగు వేస్తూనే ఉన్నారు. రక్తదానం చేయడం వల్ల బలహీనత వస్తుందనే అపోహ చాలా మందిలో ఉంది. నిరక్ష్యరాస్యులు, గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ భావన బలంగా ఉంది. అయితే ఆరోగ్యవంతులు రక్తదానం చేస్తే మరింత ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

రక్తదానం కోసం వాట్సప్ గ్రూపులు..

ప్రస్తుతం కొందరు యువకులు రక్తదానం చేసేందుకు చాలా చొరవ చూపుతున్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉండటంతో సామాజిక దృక్పథం గలవారితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి తద్వారా అవసరమైన వారికి రక్తదానం చేయిస్తున్నారు. ఎవరికైనా పలానా బ్లడ్ గ్రూపు కావాల్సి ఉందని వివిధ రకాల గ్రూపుల్లో మెసేజ్ పెట్టినా రక్తం అందుతోంది. ఇలా భద్రాచలంలో మొత్తం 7 వాట్సాప్ గ్రూప్‌లు నిత్యం రక్తదానాలపై పనిచేస్తున్నాయి.

రక్తదానంతో ప్రయోజనాలు..

రక్తదానంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలో పాత రక్తం పోయి కొత్తరక్తం ఉత్పత్తి అవుతుంది. బ్లడ్ ప్లాస్మా కూడా పునరుజ్జీవం పొంది ల్యూకోసైట్ల పెరుగుదలకు సహాయపడుతుంది. రక్తదానం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. కేన్సర్‌ను దూరం చేస్తుంది. రక్తదానం చేస్తుండటం వల్ల శరీరంలో ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే గుర్తించవచ్చు.

మొబైల్ ఫోన్ బ్లడ్ బ్యాంకుగా..

మొబైల్ ఫోన్‌నే ఓ బ్లడ్ బ్యాంకుగా కూడా సృష్టించుకోవచ్చు. స్నేహితులు, సన్నిహితులు, బంధువుల నంబర్లు ఫీడ్ చేసుకునే సమయంలోనే వారి బ్లడ్ గ్రూపు కూడా ఫీడ్ చేసుకుంటే అదే ఓ బ్లడ్ బ్యాంక్ అయ్యే అవకాశముంది. ఎవరికైనా ఏదైనా గ్రూపునకు సంబంధించి బ్లడ్ అవసరం అని తెలియగానే మన మొబైల్ ఫోన్లో ఆ గ్రూపుబ్లడ్ వారికి ఫోన్‌చేసి రక్తదానం చేసే ఏర్పాటు చేయించవచ్చు.

ఎవరు రక్తదానం చేయవచ్చు..?

రక్తదానం చేయడానికి ఉండాల్సింది రెండే అర్హతలు. చక్కటి ఆరోగ్యం, మంచి మనసు. 19 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన స్త్రీ, పురుషులు ఎవరైనా 45 కేజీల బరువు పైబడి ఉన్నవారు, 12.5 ఎంజీ హిమోగ్లోబిన్ కలిగిన వారు, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేని వారు నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చు.

ఎంత రక్తం సేకరిస్తారు?

ఒక మనిషి నుంచి కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం మాత్రమే సేకరిస్తారు. సాధారణంగా మనుషుల్లో 5 నుంచి 6 లీటర్ల వరకు రక్తం ఉంటుంది. ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తే ఒక లీటరు వరకు రక్తం పోతుంది. అయినా మనిషికి ఏమీకాదు. దీన్ని తెలుసుకుంటే కేవలం 300 మిల్లీలీటర్ల రక్తదానం చేయడం వల్ల ఏమీ కాదని అర్థమవుతుంది.

ఇవ్వడమే కాదు.. ఇప్పిస్తాను



రక్తం ఇవ్వడమే కాదు అవగాహన కల్పించి ఇతరులతో ఇప్పిస్తాను. భద్రాచలం పట్టణంలో మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. తరచూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అత్యవసర సమయంలో ఎవరైనా ఫోన్ చేస్తే వారికి రక్తం ఇస్తారు. ఇప్పటి వరకు 60 సార్లు రక్తదానం చేశారు.

-కొప్పుల మురళి, మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్, భద్రాచలం

మహిళలు అపోహలు వీడాలి



రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామని మహిళలు భయపడతారు. ఇలాంటి అపోహలు వీడాలి. రక్తంలో హిమోగ్లోబిన్ 12 గ్రాములకు పైన ఉన్న ప్రతీ మహిళ రక్తదానం చేయవచ్చు. యువతులు ముందుకు రావాలి. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానాన్ని బాధ్యతగా భావించాలి. రక్తదానం చాలా విలువైనది.

-సరోజినిపవన్ కుమార్, గైనకాలజిస్ట్, భద్రాచలం

ఆత్మీయత పెరుగుతుంది



అత్యసవర సమయంలో రక్తదానం చేయడంతో పాటు మరింత మందిని చైతన్య పరిచి రక్తదానం చేయిస్తుంటాను. ఇప్పటివరకూ 70 సార్లు కంటే ఎక్కువే నేను రక్తదానం చేశాను. రక్తదానం వల్ల కులమతాలు, ధనికపేద అనే భేదభావం నశించి ఆత్మీయత పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి.

-మహ్మద్ జిందా, జిందా బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు, భద్రాచలం

కుమార్తెను ప్రభుత్వ బడిలో చేర్పించిన హెచ్‌ఎం


పాఠశాలలో చేరిన చిన్నారితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: అతనో ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయనలా పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా తమ పిల్లలను ఎక్కడ చదివిస్తారో అందరికీ తెలిసిందే. కానీ, ఈయన మాత్రం తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. మండలంలోని నారాయణరావుపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంజా శ్రీనివాసరావు బడిబాట, అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తన కుమార్తెకు 4వ తరగతిలో అడ్మిషన్ ఇచ్చారు. గతేడాది భద్రాచలంలో చదివిన చిన్నారి.. ప్రస్తుతం ఈ పాఠశాలలో చేరింది. ప్రభుత్వ జీతం వేలల్లో తీసుకుంటూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేవారు ఎంతో మంది ఉండగా.. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తీసుకున్న ఈ నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పవచ్చు. ఇదిలాఉండగా బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు పూలబొకేలు అందచేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వేశ్‌దొర, నాగభూషణం, కోటేశ్వరరావు, మల్లం వెంకటేశ్, మల్లయ్య, వీరయ్య, కల్యాణి, సుభద్ర, హరిలాల్, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ములకలపల్లి: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా అన్నదాతలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించిన సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు సూచించారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు 45 రోజులపాటు క్లస్టర్ పరిధిలోని 66 గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాంకేతిక విజ్ఞానాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. తొలుత శాస్త్రవేత్తలు నీలిమ, కోటేశ్వరరావు రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ రవికుమార్, కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్, ఎంఏఓ అరుణ్‌బాబు, ఏఈఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో కుమార్తె పెళ్లి

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి


పిల్లి శ్రీనివాస్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మూడు రోజుల్లో ఆ ఇంట్లో పెళ్లి జరగనుండగా.. కుటుంబ సభ్యులంతా నూతన రంగులతో ముస్తాబు చేసుకున్నారు. శుభలేఖలు బంధువులకు ఇచ్చి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో పెళ్లికూతురి తండ్రి మృతిచెందాడు. దీంతో ఆ ఇంట్లో ఊహించని విషాదం అలుముకుంది. పట్టణంలోని 24 ఏరియాకు చెందిన పిల్లి శ్రీనివాస్ అలియాస్ ఏసుదాస్ (60) సింగరేణి గెస్ట్‌హౌస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు నలుగురు కుమార్తెలుండగా.. ఇద్దరి వివాహాలు అయ్యాయి. ఈ నెల 30న తన ఉద్యోగ విరమణ ఉండటంతో ఆలోపు మూడో కుమార్తె సునీత పెళ్లి చేయాలని నిర్ణయించారు. గోదావరిఖని వాసి ప్రసాద్‌తో సంబంధం కుదిర్చి.. ఈ నెల 16వ తేదీన పెళ్లి పెట్టుకున్నారు. శ్రీనివాస్ బంధువులకు శుభలేఖలు పంపిణీ చేసేందుకు శుక్రవారం మండలంలోని కొమరారం వెళ్లి.. తిరిగి వస్తున్నాడు. మామిడిగూడెం సమీపంలో ఎదురుగా వచ్చిన కోతులను తప్పించబోయి నేరుగా చెట్టును ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శ్రీనివాస్ మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది.

మలేరియాతో వ్యక్తి మృతి..?


ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పాతరెడ్డిగూడేనికి చెందిన ఉమ్మల చిన్నవెంకటరెడ్డి (38) పది రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. బుధవారం జ్వరం తీవ్రంకావడంతో మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కానీ, కుటుంబీకులు గురువారం సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మలేరియా కారణంగానే చిన్న వెంకటరెడ్డి మృతి చెందినట్లు కుటుంబీకులు, గ్రామస్తులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వినాయకపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం పాతరెడ్డిగూడెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 39 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరుగురు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. పీహెచ్‌సీ వైద్యులు రాందాస్‌నాయక్‌ను వివరణ కోరగా.. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తే మలేరియా జ్వరం నిర్ధారణ కాలేదని, జ్వరం అధికంగా ఉండటంతో పాటు ప్లేట్‌లెట్లు పడిపోవడంతో కొత్తగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశామని చెప్పారు. కాగా, మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

హత్య కేసులో 12 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏఎస్‌ఆర్ కాలనీలో ఈ నెల 7న జరిగిన కణితి సతీశ్ హత్య కేసులో పరారీలో ఉన్న 12 మంది నిందితులను భద్రాచలం టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారని ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ శుక్రవారం వెల్లడించారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు గుంజ సాయిని ఈ నెల 10న అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆయన తెలిపారు. అరెస్టయిన వారిలో బూర్గంపాడు మండలం లక్ష్మీపురం వాసి మగ్దూం మొహినుద్దీన్‌నజీర్, భద్రాచలానికి చెందిన మోటుపలి కామేశ్, వల్లెపు సాంబ, వల్లెపు దుర్గా ప్రసాద్, గుంజా గోపిచంద్, గోళ్ల గణేశ్, చెంచాలపు రాహుల్‌తేజ, గుంజా వెంకటేశ్, ఎటపాక మండలం చేన్నాంపేట వాసి గుండి రాకేశ్, ఎటపాకకు చెందిన బానోత్ మధు, సారపాకకు చెందిన చల్లా అజయ్, మోతుకురి సాయి ఉన్నారని, ఇంకా నలుగురు పరారీలో ఉన్నారని ఏఎస్పీ వివరించారు.

అసభ్య ప్రవర్తనపై వ్యక్తికి జైలు

మణుగూరుటౌన్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి తీర్పు నిచ్చారు. మండలంలోని సమితిసింగారం పంచాయతీ ఉడతానిగుంపునకు చెందిన గద్దల వీరయ్య 2016లో ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎస్.లావణ్య, దర్యాప్తు అధికారిగా నరహరి వ్యవహరించగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎస్‌ఐ యయాతిరాజు

అశ్వారావుపేటరూరల్: పార్కింగ్ చేసి ఉన్న వాహనాల నుంచి విలువైన బ్యాటరీలను అపహరిస్తున్న ఓ దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేట శివారులో శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన కిశోర్ ఆటోలో అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా రెండు బ్యాటరీలను గుర్తించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. వినాయకపురం వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న ట్రాక్టర్, డోజర్ (బ్లేడ్ ట్రాక్టర్) నుంచి వాటిని అపహరించినట్లు ఒప్పుకున్నాడు. ఆటోను సీజ్ చేసి, చోరీ చేసిన రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, స్వాధీనం చేసుకున్న బ్యాటరీల విలువ రూ.15 వేలు ఉంటుందని, నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

రాహుల్‌గాంధీనగర్‌లో దొంగల హల్‌చల్

పాల్వంచ: స్థానిక రాహుల్‌గాంధీనగర్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికుల కథనం మేరకు.. అంగోతు నరేశ్‌కు చెందిన వాసు చికెన్ షాపులో దొంగలు చొరబడి రూ.5 వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లు, మొబైల్ చార్జర్‌లు, విలువైన వస్తువులను చోరీ చేశారు. ఫర్నిచర్, ఇతర వస్తువులను దుండగులు ధ్వంసం చేసి పారిపోయారు. గతంలో కూడా కాలనీలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. దొంగల బెడదతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేకాటస్థావరంపై దాడి

పినపాక: పేకాట ఆడుతున్న పలువురుని ఈ-బయ్యారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. టి.కొత్తగూడెం గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతుండగా దాడి చేశామని, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,100 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, మరో నలుగురు పరారయ్యారని ఎస్‌ఐ రాజ్‌కుమార్ వెల్లడించారు. కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

లింక్ ఓపెన్ చేయగానే డబ్బులు మాయం

పాల్వంచరూరల్: తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేయగానే బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.33 వేల నగదు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కిన్నెరసానికి చెందిన ఇనపాల శివకిశోర్ సెల్‌ఫోన్‌కు గతనెల 7వ తేదీన లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూడగానే తన ఖాతాలో ఉన్న రూ.33 వేలు పోయాయి. బాధితుడు అదే రోజున 1930కు సమాచారం ఇచ్చాడు. వెంటనే అధికారులు ఖాతాను ఫ్రీజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

అల్లుడిపై మామ దాడి

పాల్వంచరూరల్: ఇచ్చిన డబ్బులను అడగడానికి వెళ్లిన అల్లుడిపై మామ, బావమరిది దాడి చేసిన ఘటన మండలంలోని బిక్కుతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన గుగులోతు జగదీశ్ అదే గ్రామానికి చెందిన మామ బానోతు భద్రుకు అప్పు కింద రూ.2.90 లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బులను అడగడానికి వెళ్లిన అల్లుడితో గొడవపడి తీసుకున్న అప్పు ఇవ్వకపోగా శుక్రవారం మామ భద్రు, బావమరిది సురేశ్ కలిసి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భద్రు, సురేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

టేకులపల్లి: మండలంలోని శంభునిగూడెం ముర్రేడు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తోడుకుని రెండు ట్రాక్టర్లలో రవాణా చేస్తుండగా బొమ్మనపల్లి వద్ద సీఐ టి.సురేశ్ అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.

'నా డబ్బు తిరిగి ఇప్పించండి'

అశ్వాపురం: పొలంలో త్రీ ఫేజ్ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ తీసి ఓ కాంట్రాక్టర్‌కు మూడేళ్ల కిందట అప్పు చేసి రూ.లక్ష ఇచ్చానని, ఆ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఓ రైతు తెలిపాడు. మండలంలోని జగ్గారం గ్రామానికి చెందిన రైతు బొల్లు సతీశ్ శుక్రవారం సాక్షితో మాట్లాడాడు. తనకు మూడెకరాల పట్టా భూమి ఉందని, పొలంలో విద్యుత్ సౌకర్యం కోసం మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.లక్ష మూడేళ్ల కిందట ఇచ్చినట్లు తెలిపాడు. మూడేళ్లుగా కాలయాపన చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడని, వేసిన పంటలు ఎండిపోయాయని, తీవ్రంగా నష్టపోయానని, అప్పులపాలయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు ఎకరాల పొలం అమ్మేశానని, రైతును కాస్తా కూలీగా మారానని, అధికారులు స్పందించి తన డబ్బు వడ్డీతో సహా ఇప్పించి న్యాయం చేయాలని రైతు కోరాడు. కాగా, విద్యుత్‌శాఖ అధికారులను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ చేపడుతామని తెలిపారు.

ఆరు లీటర్ల నాటుసారా పట్టివేత


నిందితుడు, నాటుసారా చూపుతున్న అధికారులు

టేకులపల్లి: కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం మండలంలో తనిఖీలు చేపట్టి నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని చంద్రుతండ వద్ద ద్విచక్రవాహనంపై ఆరు లీటర్ల నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని డీటీఎఫ్ ఎస్‌ఐ గౌతమ్ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణగౌడ్, గురవయ్య, వెంకటనారాయణ, సుమంత్, రమేశ్ పాల్గొన్నారు.